# విధి విలపించింది

**పెద్దింటి విజయలక్ష్మి**



పెళ్ళీడు కొచ్చింది సీత. ఇప్పటికి రెండు మూడు సంబంధాలను సంప్రతించటం అయితే జరిగింది. కానీ, యింకా ఏదీ స్థిరమవలేదు.

సీతతండ్రి జానకిరామయ్య మామూలు మనిషి ఎదుటివారి కోరిక మేరకు తూగలేడు। తన శక్త్యానుసారం మాత్రం చేసే నైజం కలవాడు. అప్పులు చేసి, నెత్తిమీద బరువెత్తుకోవాలని ఆయనకు లేదు. అందుకే సీత పెళ్ళి ప్రయత్నాలు

విఫలమవుతుంటే,గుండెలమీద కుంపటిగా భావించలేదు.

'దేనికీ ఓ సమయం అంటూ రావాలి. అది వస్తేగానీ ఏ పనీ జరగదు. శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదుట. ఆ 'వేళ' వచ్చేవరకు మనం ఏం చింతించినా లాభంలేదని తెలిసి తెలిసీ చింతించటం ఎందుకు? అమ్మాయి 'పెళ్ళి కాకుండా యిలాగే వుండిపోదు' అని-తనకు తాను చెప్పుకుని, భార్యకు, యింకా ఇతరులకు చెప్పేవాడు.

ఆయన ఆ నెమ్మదితనమూ, శాంత స్వభావమూ కొంతమందిని అబ్బుర పరచేది।

ఆయన నిశ్చింతని చూసి, ఆయన భార్య పార్వతమ్మ బుగ్గలు నొక్కుకునేది.

పెద్దవాళ్ళ గురించి యిలా వుండగా, సీత మనసు. కొన్ని విచిత్రాలకు లోనయ్యేది।

పద్దెనిమిదేళ్ళ యౌవనపు ప్రారంభం లోవున్న సీతకు జగమంతా వసంత శోభగా గోచరమయ్యేది

సిగ్గుదొంతరలు ఆమెను మొగ్గను చేశాయి।

తనకన్నా నాలుగైదేళ్ళు ఎక్కువున్న యువకులు కనిపిస్తే, మెరుపుతీగలా చాటుకి వెళ్ళేది. కానీ, మనసు-చూసిన ఆ యువకుని చుట్టూ తిరిగేది. చూసినవాడు అందగాడైతే ఆమె మనసు మరింత పరవశించేది. వయసు పెట్టే గిలిగింతలు, ఆమె లేడికనులలో ప్రస్ఫుటమయ్యేవి. రెండుమూడుసార్లు పెళ్ళి చూపుల అనుభవం కూడ వుందేమో—పెళ్ళంటే ఏమిటి? మొగుడంటే ఏమిటని కల్యాణ మైన తన స్నేహితురాలు కల్యాణి హాస్యమాడుతుంటే కొద్దిగా అర్థమై, కానట్టుగా వుంది. ఆ అవస్థే ఓ గిలిగింత। పూర్తిగా అర్థమైనా క్రొత్తలేదు అర్థం అసలు కాకున్నా బాధలేదు। కానీ యీ దశ పడుచుపిల్లల మనస్సులను పరవళ్ళు పెట్టే దశ।

ఇదిలా వుండగా, సీత యింట్లో ముందర ఓ గది ఖాళీగా వుంది. అందులో ఎవరో ఒకరు అద్దెకు రావాలి. ఒక్క గది కాబట్టి, మనిషి కూడ ఒకడు గానో, ఒకర్తెగానో వుంటేనే సౌకర్యం। ఎవరో చదువుకునే విద్యార్థియో, పరాయి వూళ్ళో వుద్యోగాలు కొచ్చే బ్రహ్మచారియో, చారిణియో, రావాలి.

ఎవరొస్తారో—అందులో చేరేదాక ఎవరికీ తెలియదు।

సీత అనుకుంది—'ఎవరన్నా తన వయస్సున్న జవ్వని వస్తే తనకు తోడుగా వుంటుంది' అని।

ఒక శుభసమయాన, ఓ వ్యక్తి ఆ యింటి గేటు తీసుకుని లోపలికి వస్తున్నాడు.

ముందు సీతే చూసింది.

అతను సీతను చూసి 'ఈ యిల్లు

గలాయన యిక్కడే వున్నారాండీ!' అని అడిగాడు.

అతను చూడటానికి చాలా మంచి వాడులా కనిపించాడు. అందంగా వున్నాడు. చదువుకున్నవాడిలా, ఓ ఉద్యోగస్థుడిలా వున్నాడు.

ఆ వ్యక్తిని చూసిన పిదప, అతని మాటలు విన్నమీదట సీతకు అవ్యక్తానుభూతి కలిగింది!

హృదయవీణ శృతులు సవరించుకుంటూంది.

'మా నాన్నగారేనండి. పిలుస్తాను. కూర్చోండి' అని కుర్చీ చూపించింది.

అతను కూర్చున్నాడు. ఆమె లోపలికి వెళ్ళింది. ఓ ఐదునిమిషాల, యిరవై సెకన్లు గడిచిన తర్వాత జానకిరామయ్యగారు అక్కడికి వచ్చారు.

కళ్ళజోడు సవరించుకుంటూ, చిరునవ్వుతో అతన్ని చూశారు. వచ్చిన ఆ వ్యక్తి చటుక్కున లేచి నించుని, 'నమస్కారమండీ' అన్నాడు—అంజలి ఘటించి!

'ఊఁ, ననమస్కారం! కూచో బాబూ' అంటూ తానూ కూర్చున్నాడు జానకిరామయ్యగారు!

మనిషే అయినా, వయసు మహిమేమో అతని కంటికి మేరుపర్వతంలా కనిపించారాయన

మాట్లాడిన ఆ రెండు ముక్కల్లోనే, 'మీ యువతరానికి మేము పెద్దలం. పైచేయి మాదే' అన్న ధీమా ధ్వనించింది.

'ముందున్న ఆ గది అద్దెకిస్తారని విన్నానండి. చూద్దామని వచ్చాను' — ఎంతో వినయంగా అడిగాడు అతను!

'అలాగా నీ పేరేమిటి నాయనా!'

'మోహన్రావండీ.'

'ఉద్యోగమా?'

'అవునండి. బ్యాంకులో గుమాస్తా.'

'బాగుంది. అసలు మీ వూరు, తలితండ్రులు '

'మాది యిక్కడికి వందమైళ్ళ దూరంలో ఓ చిన్న గ్రామమండి. అక్కడే వుంటారు మా తలితండ్రులు. మా నాన్నగారు వ్యవసాయం చూస్తారు.'

'అయితే భూమీ బుట్ర వున్నవాళ్ళేనన్నమాట. నిన్నూ వ్యవసాయంలోకి దింపక, చదివించి, ఓ వుద్యోగస్థుణ్ని చేశారన్నమాట మీ నాన్న'— ప్రశంసాపూర్వకంగా, గంభీరంగా నవ్వారు జానకిరామయ్యగారు.

'అవునండీ,' అంటూ సంతోషంగా నవ్వుతూ, సిగ్గుపడ్డాడు మోహన్రావ్.

'పెళ్లైందా బాబూ?'—బాంబు పేల్చినట్టుగా అడిగారు జానకిరామయ్య.

'అబ్బే, యింకా లేదండి'— భయం నుంచి తేరుకున్నవాడిలా సమాధానమిచ్చాడు.

'ఎందుకంటే, ఒకే గది నాయనా. పెళ్లాం పిల్లలున్న వాళ్ళకి యిబ్బంది పెట్టడంకన్నా, వీలాంటివాళ్ళ కివ్వటం నయం కదా' ఆ మాటలకు నూటికి

నూరు మార్కులు కొట్టేసినంత సంబరం కలిగింది మోహన్రావుకి.

'కానీ, పెళ్ళీడుకొచ్చిన పిల్లను పెట్టుకుని, యీ ముసలాయన కిదేమి ఆలోచన ! సహజ విరుద్ధంగా వుందే యీయిన మనస్తత్వం' అనుకున్నాడు.

'అయినా, ఆ పిల్లకు పెళ్ళి కాలేదని రుజువేమిటి? పెళ్లైందేమో! ఐనా, ఎందుకొచ్చిన గొడవ. ఆయనకు నాలాటివాడే కావాలి. నేనే వచ్చాను కాబట్టి సరిపోయింది' అని మనసుకి సర్ది చెప్పుకుని,

'గది అద్దె ఎంతండి? ఓ మాటు చూపిస్తారా?' అని అడిగాడు.

'అద్దె అరవై రూపాయలు బాబూ. రా చూపెడతాను' అని, వెంట తీసి కెళ్లారు.

అద్దైన వారంరోజులకే, మోహన్రావ్ ఆ యింట్లో, ఆ గదిలో అద్దెకు చేరాడు.

ఆనాడు, తలుపు చాటుగా వినబడి, తండ్రితో అతని సంభాషణ విన్న సీత, అతను తమ యింట్లోనే చేరటం లోలోపల సంతోషించింది.

మోహన్రావుని చూసిన తర్వాత, 'తనలాంటి జవ్వని' రానందుకేమీ చిన్న బుచ్చుకోలేదు ! చాటుమాటుగా వుండి, అతని చర్యలను గమనించసాగింది సీత!

అతను తలవంచుకుని, తనేమో, తన పనేమో అన్నట్టుగా వున్నాడు !

సీత అట్టడుగు మనసులో కొంత నిరుత్సాహం కలిగినా, 'మంచివాడు' అనుకుంది పైపై మనసుతో! రానురాను మోహన్రావ్ సీత మనసులో తిష్టవేయ నారంభించాడు ! ఆమె కలల్లో కథా నాయకుడై కూర్చున్నాడు.

'ఇలా కనిపించి, అలా మాయ మయ్యాడు' అని లేకుండా, తమ యింట్లోకే వచ్చి చేరాడు. అందుకే ఎప్పుడూ కనులలోనే మెదులు తున్నట్లుగా వుంటాడు.'

ఈలోపుగా సీతకు మరో పెళ్ళి సంబంధం వచ్చింది. పెళ్లివాళ్ళొచ్చారు —పెళ్ళి కొడుకుతో సహా ! సీతను చూసి వెళ్ళారు. ఇంకా మిగిలిన విషయాలలో వుత్తరాల రాకపోకలు జరుగుతున్నాయి.

'ఈ సంబంధమూ తప్పిపోతేబావుణ్ణు' అనుకుంది సీత ! ఆమె మనసులోని పోరాటం, ఆవేశం ఆమె పెద్దలకు తెలియదు. చెప్పటానికి ఆమెకూ భయం. అలా ఎవరిధ్యాసలో వాళ్ళు కొన్ని రోజులు గడిపారు.

ఆ రోజు సీత పుట్టినరోజు. కొత్త బట్టలు కట్టుకుని అందరికీ నమస్కరించింది.

అందరూ అన్నారు,'శీఘ్రమేవ వివాహ ప్రాప్తిరస్తు' అని.

అది దీవెన ! అలా దీవిస్తుంటే, సీత మనసులో మోహన్రావ్ మెదిలాడు.

'వీళ్ళ దీవెన ఎలా ఫలిస్తుందో'




నన్ను సంశయమూ, భయమూ కూడ ఆమెకు లేకపోలేదు.

కానీ, తన మనసుని అందరి ముందూ పరిచే తెగువ ఆమెకు లేదు. అణకువ, మంచి, మర్యాద అనే మాటల మధ్య పెరిగింది పెద్దవాళ్ళు చెప్పినట్టు వినటమే యింతవరకూ తనకు తెలుసు కానీ, ఎప్పుడూ వుల్లంఘించ లేదు ఇంత కాలమూ అలాంటి అవసరమూ రాలేదు. ఇప్పుడే ఆమెలో ఎటూకాని సంఘర్షణ!

ఆ రోజు తలితండ్రుల సంభాషణ విన్న సీత స్థబించిపోయింది! 'ఫెళ ఫెళ' కళ్ళు పొడిచే మెరుపు, భూమి అదురు తున్న ధ్వని, కర్తవ్యాలను పూడ్చి వేస్తున్నట్టు ధూళిని రేపే సుడిగాలి యీల—తుఫాను వాతావరణం ఆమెలో చెలరేగింది. కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. అవి వర్షించాలి ఆ తర్వాత ఆ బరువు, మనసులో రేగిన భీభత్సం అణగారాలి!

ఒంటరిదై, తన గదిలో కూర్చుని ఎంతసేపు విలపించిందో సీత, ఎవరికీ తెలియదు.

తలితండ్రుల సంభాషణ చెవుల్లో మార్మోగుతున్నది.

'పార్వతీ, మొన్న అమ్మాయిని చూసివెళ్ళినవాళ్ళ దగ్గరనుంచి వుత్తరం వచ్చిందే'—జానకిరామయ్య అప్పటికే ఒకమారు అందరి విషయాలను తెలుసుకున్నారేమో—ఆయన కంఠంలో సంతోషం తొణికిసలాడింది.

'ఏమి వ్రాశారండీ? పెళ్ళికి సమ్మతించారా?' పార్వతమ్మ ఆతృతగా అడిగింది.

'ఊం, శుభవార్తే, శుభవార్త! నేను చెప్పలేదూ, దేనికైనా వేళ

రావాలని అది వచ్చింది, అమ్మాయి పెళ్ళి కుదిరింది ఇంక మనకే బెంగా లేదు. అబ్బాయి కూడ చదువుకున్న వాడు; మంచి ఉద్యోగస్థుడు. మన సీత అదృష్టవంతురాలే.'

'అవును. ఇదంతా దాని అదృష్టమే. కట్నకానుకల్లో పేచీ ఏమీ లేకుండానే సంబంధం కుదిరింది; ఇక అందరికీ వుత్తరాలు వ్రాసేయాలి'—తెగ సంబరపడి పోయింది పార్వతమ్మ

'ఊఁ, యింక కాఫీయ్ నువ్వు యింటి పనులు, నేను బయటి పనులు చూసు కుంటూ, చకచక పెళ్ళినాటికి అంతా రెడీ చేయాలి. నేనో మాటు పంతులు గార్ని చూసొస్తా—ఆ ఖండువా' అందుకో.

'ఇదుగో— ఖండువా అందిచ్చింది' పార్వతమ్మ.

కూతురి పెళ్ళి కుదిరితే యింత ఆనంద పరవశమా కన్నవారికి! ఆశ్చర్యంతోపాటు — మెల్లిగా ఆవేదన కూడ చోటు చేసుకుంది సీత మనసులో.

ఇప్పుడు తనేం చేయగలదు ?

'ఈ పెళ్ళి వద్దు నాన్నా. నేను పెళ్ళంటూ చేసుకుంటె మోహన్రావునే చేసుకుంటాను' అని చెప్పగలదా ?

అసంభవం!

అసలు . అసలు.... మోహన్రావుకి తనపైనున్న అభిప్రాయ మేమిటో! తనంటె యిష్టమో, లేదో ? ఇంతకు ముందే ఏ మేనరికం లాంటి దేమన్నా వుంటే, యింక ఆ ప్రసక్తే లేదు.

అతన్ని చూడగానే తన మనసు వుబలాటపడేది గానీ, అతను తల వంచుకుని వెళ్ళిపోయేవాడు గదిలోకి.

అలాంటి అతని మంచితనాన్ని తిట్టాలనివుంది సీతకిప్పుడు! ఇప్పుడు తనేమన్నా చేస్తే, చివరికి తలితండ్రుల ఆనందాన్ని కూడ తుడిచివేసినదౌతుంది. వారి పరువు ప్రతిష్ఠలకు భంగం కల గొచ్చు. అజన్మాంతం వాళ్ళని దుఃఖ సాగరంలో ముంచిన దౌతుంది. కాబట్టి, తాను యిప్పుడు ఏమీ చేయకూడదు. ఏమీ ఎరగనిదానిలా వుండాలి కలలు కల్లలుగా మారినా, మనసులో అసంతృప్తి పేరుకుపోయినా, మనసునో శిలగా మార్చుకుని, వాటిని అంటనీయకుండా జాగ్రత్త పడాలి! అదే తన ప్రస్తుత కర్తవ్యం. ఈ జన్మ కింతే ఫలం. ఇదే తనకు దేవుడు నిర్ణయించిన జీవితం. తప్పదు. దీనినే సంతోషంతో స్వీక రించాలి ' సీత చివరికా నిర్ణయాని కొచ్చింది! పెళ్ళి దగ్గర య్యే కొద్దీ యింట్లోవాళ్ళ హడావిడికి చూసే చూడ నట్టుగా మెసలుతుంది. ఇంక రెండ్రోజు లుందనగా యింట్లో చుట్టాల కలకలం ఎక్కువైంది. అని వయసుల వాళ్ళూ యింట్లో చేరి, యిదే 'ప్రపంచం' అని పించారు.

కొంతమంది తనని ఏవేవో మాటల్తో

ఎగతాళిచేశారు పూర్తిగా మొహం ముడుచుకుని కూర్చోలేక పోయింది. ముసిముసిగా నవ్వింది। ఎదుటి వాళ్ళకి ఆ నవ్వులో జీవం కనిపిస్తే చాలు।

ఇంటి చుట్టూ పందిరి వేశారు. ముందర షామియానా కట్టారు. అరటి చెట్లు కట్టారు. మావిడాకులు ముడిచారు. పెళ్ళిరోజుకి పూర్తిగా పెళ్ళికళ — ఆ యింటి కొచ్చేసింది. ఎందుకో, అటొచ్చిన సీత — మోహన్రావ్ గది కూడ తమ చుట్టాలు ఆక్రమించి వుండటం చూసింది.

'ఇదేమిటి? తనకు తెలియదే। అత నేమయ్యాడు?' అనుకుంది.

'అమ్మా, ఆ ముందర గదిలో కూడ మనవాళ్ళు వున్నారేమిటే?' అని తల్లి నడిగింది.

'అవునమ్మా, పెళ్లైయ్యేవరకూ కాస్త ఆ గదీ యివ్వమని అతన్నడిగారు నాన్న గారు. అతను ఓ వారం సెలవు పెట్టాడుట, వాడుకోమని చెప్పి,' కూతురికి సమాధానం చెప్పి హడావిడిగా వెళ్ళిపోయింది పార్వతమ్మ.

సీత మనసులో నిరాశ చోటు చేసుకుంది.

'ఆఖరికి అతను నా పెళ్లి కూడ చూడకుండా వెళ్ళిపోయాడు. అమ్మా, నాన్న వుండమని బలవంత పెట్టలేదేమో। అవును, అతను చుట్టమా, పక్కమా వుండమని ఆపేయటానికి. ఉన్నా మానినా అతనిష్టమే. అతని కిష్టంలేదా తన పెళ్ళి చూడటానికి? ఎందుకిష్టం లేదు?'

ఇంక ఆలోచించలేకపోయింది సీత. అతన్ని గురించిన ఆలోచనలు అనర్థ దాయకం. అదుపులో వుండు' అనిమనసు హెచ్చరించింది.

మంత్రాల మధ్య, మేళతాళాల హోరులో, అగ్నిసాక్షిగా సీత పెళ్ళి జరిగిపోయింది.

ఆమె భర్త వెంకట్రావు–ఆమెను, అదను దొరికినప్పుడల్లా క్రీగంటచూసి నవ్వుతున్నాడు.

మెల్లి మెల్లిగా తాను నవ్వటం నేర్చుకుంది. తన మనసులో వెంట్రావు రూపాన్ని ప్రతిష్ఠించ ప్రయత్నాలు చేసింది. అతని సపర్యలోనే ఆనందం వెతుక్కుంది. అతనికే తన జీవితం అంకితం చేసి, భారత నారీమణి అలనాటి సీతమ్మకు ప్రతీకగా నిలిచింది। మాన సికంగా తన మెడలో మెరిసే తాళికి, దాన్ని కట్టిన వెంకట్రావుకి ఎంతో గౌరవ మర్యాదల నందించి తమ వంశ గౌరవాన్ని నిలబెట్టింది।

భర్తతో కాపురానికి వెళ్ళింది సీత. వెంకట్రావుకి ఢిల్లీలో వుద్యోగం. అంత దూరం పంపలేక పంపారు తలిదండ్రు లామెను. ఎక్కడవున్నా తమ కూతురు సుఖపడితే చాలునని వారి భావన। అను కున్నప్పుడల్లా వెళ్ళిరావటం కుదరదని

పనికాబట్టి, కనీసం వారానికో వుత్తరం తప్పక వ్రాస్తుండమని కూతుర్ని కోరారు. ఆమె వుత్తరం వచ్చినరోజు, యిక ఆ తలిదండ్రులకు అన్నం నీళ్ళు అక్కర్లేదు! కూతురి వుత్తరాల ద్వారా అల్లుడి మంచితనం ప్రస్ఫుటమయ్యేది తమ బిడ్డ అదృష్టవంతురాలని పొంగిపోయేవారు.

అలా రోజులు గడుస్తున్నాయి. సీత తొలి పండుగలకి కూడ ఇంటికి రాలేదు

అందుకు విచారిస్తూ తండ్రి వుత్తరం వ్రాస్తే,

"మీ అల్లుడు — యీ ఒక్కరోజు పండుగ కోసం అంతదూరం వెళతామా? ఈ రోజుల్లో 'యిలాంటి సెంటిమెంట్లు, మానుకోవాలి ఏడాదికోసారి, ఒక నెల సెలవుపెట్టి' వెళితే, అక్కడ వున్నట్టూ వుంటుంది. ఎక్కడ ఢిల్లీ, ఎక్కడ మీ వూరు!! అంటున్నారు. ఏమీ అనుకోకండి నాన్నగారు. అమ్మని బాధపడవద్దని చెప్పండి. మేము వీలుచూసుకుని ఓ నెల వుండేలా వస్తాము' అని జవాబు వ్రాసింది

చేసేదిలేక, కూతురికీ, అల్లుడికీ బట్టలకి డబ్బు పంపి తృప్తిపడ్డారు జానకిరామయ్యా దంపతులు.

ఏడాది తర్వాత సీత, వెంకట్రావులు జానకిరామయ్యా గారింటికి వచ్చారు.

ఏడాది తర్వాత చూసిన కూతుర్ని ఒక్క నిమిషం వదలకుండా కబుర్లు చెప్పాడు జానకిరామయ్య. కూతురికీ, అల్లుడికీ యిష్టమైనవి చేయడమే పార్వతమ్మ పని!

ఏ పండగా లేకుండా, వాళ్ళింట్లో పండగ వాతావరణం నెలకొంది.

వాళ్ళొచ్చి పదిహేను రోజులు గడిచాయి. ఆ మాట, యీ మాటమీద, మోహన్రావు మాట కూడ వచ్చింది.

'ఇంకా అతనే వున్నాడమ్మా ఆ గదిలో' అని అడిగింది సీత.


ఎందుకంటే, తానొచ్చిన దగ్గరనుంచి ఆ గది తలుపుకి తాళంకప్పనే చూస్తూంది. భర్త వుండబట్టి ఆ ఆలోచన ఎక్కువచేసే అవకాశం చిక్కలేదు. అటు, యిటు తిరగటంతోనే సరి పోయింది పదిహేను రోజులు!

ఇప్పుడే అతని సంగతి తెలుసుకో టానికి కాస్త తీరిక చిక్కింది. మోహన్రావుని మర్చిపోకపోయినా, తన అభిప్రాయాన్ని మాత్రం మార్చుకుంది సీత. అందుకే ధైర్యంగా అడగ గలిగిందేమో!

'మోహన్రావుకి పెళ్లైంది సీతా. మొన్ననే — మీ నాన్నగారు కూడ పెళ్ళికి వెళ్లొచ్చారు అతని మేనమామ కూతుర్ని చేసుకున్నాడు '

సీతకు ఆ కబురు సంతోషాన్నే కలిగించింది. ఆ మేనమామ కూతురు అదృష్టవంతురాలనుకుంది మనసులో!

'అయితే యిప్పుడప్పుడే రాడన్న మాట. కాపురం పెడితే, యింక కొంచెం




పెద్ద యింట్లోకి వెళతాడేమో' యధా లాపంగా అడిగింది.

'అతను యింట్లో మనిషిలా కలిసి పోయాడు సీతా పక్కన మరో గది కలిపి, కాపరానికి తగినట్టుగా చేసి, అతనికే యిద్దామంటున్నారు మీ నాన్న గారు.'

సీత దానికేమీ సమాధానం చెప్పలేదు.

పదిహేను రోజుల తర్వాత సీత, వెంకట్రావ్ ఢిల్లీకి వెళ్ళిపోయారు.

ఆ తర్వాత సంవత్సరం కూతురూ, అల్లుడూ మరీ మరీ పిలిస్తే, జానకి రామయ్య దంపతులు ఢిల్లీకి వెళ్లారు. కాబట్టి, ఆ యేడు సీత యీ ప్రాంతాలకి రాలేదు

మరో రెండు సంవత్సరాలు కూడ, సీత పుట్టింటికి రాలేకపోయింది. ఆమె భర్త ఆమెను వుత్తరదేశంలో మరి కొన్ని వూళ్ళు చూసిరావటానికి తీసుకెళ్లాడు మరలా కూతుర్ని చూడాలని వేయి కళ్ళతో ఎదురు చూడసాగారు జానకిరామయ్య, పార్వతమ్మలు.

సీత పెళ్లై ఐదు సంవత్సరాలు పూర్తయ్యాయి.

ఇంకా సంతానం కలగలేదు. అప్పుడప్పుడూ ఆ వెలితి కనిపించసాగింది.

తన భర్తను పోలిన కొడుకు పుట్టాలని ఆమె అంతర్మనసు వాంఛ। ఎదురు చూపులో వుంది।

ఆ యేడు ఆమె ఒక్కర్తే పుట్టింటికి వచ్చింది. ఆఫీసులో పని ఒత్తిడివల్ల రాలేనన్నాడు భర్త।

అతన్ని వదిలి వెళ్ళబుద్ధవలేదామెకు।

భార్య మనోవాంఛని అర్థంచేసుకున్న వెంకట్రావు, ఆమెను వెళ్ళిరమ్మని ప్రోద్బలించాడు.

తలిదండ్రులను చూడాలన్న కోరిక

కూడ సమంగా వుండటం వల్ల, ప్రయాణం అయింది సీత.

సీత రాక జానకిరామయ్య, పార్వ తమ్మలకు ఎంతో సందడిగా వుంది.

సీత వచ్చి వారం రోజులయ్యాయి.

అంతవరకూ దాచిన ఓ విషయం, యింకా కూతురికి చెప్పకుండా వుండలేక పోయింది పార్వతమ్మ.

ఆ మాట విన్న సీత, ప్రక్కనే పిడుగు పడ్డట్టు స్థభించిపోయింది!

కళ్ళముందు ప్రపంచం గిరగిర తిరుగుతున్నట్టు అయ్యింది.

'ఎంత ఘోరం జరిగిపోయిందమ్మా' అంది నీరసంగా. ఆమె కన్నుల్లో లీలా మాత్రంగా కన్నీటి తెర కమ్మింది.

నిజమేనమ్మా, చాల ఘోరం పెళ్లై యేడాదైందేమో, అంతే. అతని జీవితం అనుభవపూర్వకమై పోయింది. మంచి వాళ్ళనే భగవంతుడు సోధిస్తుంటాడు. ఏనాడు ఏపాపం చేశాడో, యీనాడు. అనుభవిస్తున్నాడు'. పార్వతమ్మగారు తాత్త్వికంగా మాట్లాడినా, ఆ మాటల్లో ఆమె బాధ కూడ వ్యక్తమౌతూంది!

అప్పటినుంచీ సీతలో నిరుత్సాహం పేరుకుపోయింది. మోహన్రావ్, తమ యింటిలో చేరేవరకూ ముక్కూ మొహం తెలియనివాడు. మొదట ఒక రకంగా తన మనసులో చోటుచేసుకున్న, మానసి కంగా దగ్గరయ్యాడు. తర్వాత, తాను పరిస్థితులతో రాజీపడి, మనసు మార్చు కుంది. అయినా, అతను మనసుకి దూరం మాత్రం కాలేదు. చిరకాల పరిచయం, అతన్ని దగ్గరివాణ్ణి చేసింది. తను యింట్లో ఓ సభ్యునిలా చేసింది! ఇప్పుడు అతని కొచ్చిన కష్టానికి, తమ యింట్లో అందరూ మనోవ్యధ ననుభవిస్తున్నారు. తనకు మరింత ఎక్కువగా వుందేమో! కానీ, తన మనసు మట్టుకు నిర్మలమైందే!

మరో పదిరోజులు గడిచాయి. మోహన్రావ్ వచ్చాడు. మనిషి చాల నీరసించి పోయాడు. అతని మనసుకి ఓ గాయం తగలటం వల్ల, మనిషి జబ్బుచేసినవాడి కన్నా హీనకళతో వున్నాడు!

తన గదితలుపులు తీసుకుని, తల వంచుకుని లోపలికెళ్ళిపోయాడు.


అతన్ని చూడగానే, దగ్గరకెళ్ళి ఓదార్పు మాటలు చెప్పాలని సీత మనసు తహతహలాడింది.

మొదట తల్లీతండ్రీ వెళ్ళి మాట్లాడి వచ్చారు. అతని గదినుంచి బయటికి వస్తున్న వారి మొహాలు కళావిహీనంగా వుండటం గమనించింది సీత.

'అతనెలా వున్నాడో' అనుకుంది పదే పదే.

అతనితో మాట్లాడాలని వుంది గానీ, ఎందుకో అలా వుండిపోయింది. తన మనోప్రవృత్తి తనకే వింతగా తోచి, నవ్వుకుందొక సారి!

ఇంతలో మరో ఘోరం జరిగి పోయింది.




సంతోషాన్ని మాత్రమే కోరే మనుషులను, దుఃఖసాగరంలో ముంచి వేడుక చూడటం ఆ దేవుని క్రీడ కాబోలు! లేకుంటె, యీ దుఃఖాలు ఎందుకుసంభవిస్తాయి? కనిపిస్తే, తన చర్యలకుమనుషులు వారి కసి తీర్చుకుంటారేమోనని, ఆ దేవుడు ఎవ్వరికీ కనిపించడుకూడ!

దేవుడు పిరికివాడు! తాను సృష్టించిన మనుష్యులకే కనబడటానికి తనకు ధైర్యం చాలదు. కనుమరుగ్గా వుండి, యిలాంటి ఘోరాలు సృష్టించుతుంటాడు.

అందుకున్న టెలిగ్రాంలోని సంగతి చదివి, "సీతా" అని ఓ కేక పెట్టారు జానకిరామయ్యగారు.

ఆ పిలుపులో దుఃఖం, దైన్యం, భయం అంతా మిళితమైవుంది.

తండ్రి పిలుపుకి అదిరిపడి వచ్చిన సీత, ఆ గులాబిరంగు కాగితం అందుకుని, చదివి, కుప్పగా కూలిపోయింది. ఆమె నోటంట ఏమాటా రా లేదు. అప్రయత్నంగా కన్నీరు కాలువలు కడుతూంది.

వారి పరిస్థితి చూసి అదిరిపడ్డ పార్వతమ్మ, దిక్కుతోచక మోహనరావుని పిలుచుకుని వచ్చింది.

'ఏమిటి బాబూ, నువ్వన్నా చెప్పు నాయనా. తండ్రీకూతుళ్లు నా ఆరాటం పట్టించుకోకుండా అలా ఐపోయారు. ఎంత అడిగినా ఏమీ చెప్పటం లేదు' అంటూ కళ్ళొత్తుకుంది.

సంగతి తెలుసుకున్న మోహనరావు క్షణం స్థంభించిపోయాడు. అతని కన్నుల్లో కన్నీళ్లు నిండాయి.

'ఏమిటి నాయినా. త్వరగా చెప్పు.' అంటున్న పార్వతమ్మని నిశితంగా చూశాడు అ తర్వాత, దేవునిచే తను యీ కార్యానికే నియమింపబడ్డవానిలా 'మన సీత భర్త, యాక్సిడెంట్‌లో పోయారటమ్మా' అనేసి, అక్కడినుంచి వెళ్ళిపోయారు.

'స్త్రీతమ్మా' అని పార్వతమ్మ కూతుర్ని వాటేసుకుని విలపించింది. క్షణంలో ఆ యిల్లు ఏడుపులతో కళ కోల్పోయింది.

తన గదిలో మోహన్రావుకూడ అదే పరిస్థితిలో వున్నాడు. ఆ క్షణాన భూమ్మీద పడ్డ మానవులు ఏకమయ్యారు గానీ, సృష్టించిన భగవంతుడు పరాయి వాడైపోయాడు! అంతా నిందించారు!

సీత బ్రతుకు పంట, ప్రకృతి బీభత్సానికి కొట్టుకుపోయింది! ఆమెకు మిగిలిందిక బీడువారిన జీవితం.

సీత దుర్భరంగా రోజులు గడప సాగింది. కూతుర్ని తలచి కుమిలి పోయారు ఆమె తలితండ్రులు. ఏమి చేయాలో అర్థంకాక చేతులు నలుపుకోటం మినహా, యింకేమీ తోచలేదు వారికి.

ఒంటరిగా కూర్చుని కన్నీరు కార్చే సీత మనసులో ఆమె భర్త వెంకట్రావు మిగిలిపోయాడు. అతన్ని తలచి తలచి విలపించేది.

ఆరోజు మల్లె పందిరి క్రింద కూర్చున్న సీతను చూసి, దగ్గరకొచ్చాడు మోహన్రావు.

'సీతగారూ' అన్నాడు - అల్లంత దూరంలో నిలబడి. సీత ఏదో పరధ్యానంలో వుంది. అతని పిలుపు ఆమె చెవుల కందలేదు.

'సీతగారు' అన్నాడు మరలా తటపటాయించి.

ఇటుతిరిగి చూసిన సీత, కన్నుల్లో కన్నీరు గమనించాడతను. బొట్టులేని ఆ వదనం చూస్తుంటే, అతని కడుపులో బాధ మెలిదిరిగింది.

తన రాకని గమనించిన సీత చటుక్కున లేచి నిలబడింది. కన్నీళ్ళు తుడుచుకునే ప్రయత్నమేమీచేయలేదామె.

'సీతగారూ. మీరలా కన్నీళ్ళు పెట్టుకుంటె, నేను చూడలేనండి. విధిచేతుల్లో కీలుబొమ్మలం మనం. ఏదెలా జరగాలనందో అలాగే జరుగుతుంది. అన్నిటినీ దిగమింగి, రోజులు గడపడమే మనం నేర్చుకోవాలి. నా భార్య, పుట్టిన పసికందు ఒక్కసారి కన్నుమూసిన నాడు నాకు అంతా అంధకారంగా తోచింది. కానీ, కాలక్రమేణా యిదంతా ఓ మిథ్య అని తెలుసుకున్నాను. ఏడ్చి లాభం లేదు సీతగారూ.'

సీత ఏమీ మాట్లాడలేదు. మోహన్రావు యింత మాట్లాడగలడా అన్నట్టు ఆశ్చర్యపోయి చూస్తోంది.

అంతలో మోహన్రావు, స్వాధీనం తప్పినవాడిలా చిత్రంగా మాట్లాడాడు. ఈ ఘోరం జరిగిన తర్వాత, తన



మనసులో మారుమ్రోగుతున్న మాటను వళంతప్పి అనేశాడు।

'అసలు, ఆశించినట్టు జరిగివుంటె, యిప్పుడు యిద్దరి జీవితాలూ ఎంతో బాగుండేవి. నేను ముందే చెప్పాను కదూ, విధి బలీయమని. మిమ్మల్ని చూసిన ఆ మొట్టమొదటి సారే, మీరు నన్ను ఆకర్షించారు. మీతో నా పెళ్ళి ఆలోచన కూడ వచ్చింది. కానీ, అంతా బయటపెట్టేలోపుగా, నా కళ్ళముందే మీ పెళ్ళి తీర్మానమైంది. మనసొప్పకే పెళ్ళికి నేనుండకుండా వెళ్ళిపోయాను. మీరేమనుకున్నా నాకు ఫరవాలేదు. మీ యందు నాకిప్పటికీ ప్రేమ వుంది. నా మనసు మిమ్మల్ని యింకా ఆహ్వానిస్తూనే వుంది. ఈ వయస్సులో మీ జీవితం అడవికాచిన వెన్నెల కాకూడదు. మీరు మళ్ళీ మీ నుదట తిలకం దిద్దుకోవాలి. మీ మొహం కళకళ లాడాలి. మీరు వుత్సాహంగా తిరగాలి. తల్లిగా మారి,

మీ ముద్దుబిడ్డలని పెంచాలి. మీరు ఊఁ అంటే నేను....'


అతను మాట పూర్తి చేయలేదు. 'మోహన్రావ్' అని పిడుగు పడ్డట్టుగా అరిచింది సీత. అదిరిపోయి ఓ అడుగు వెనక్కి వేశాడు అతను. ఒక రకమైన ఆవేశం నుంచి బయటపడ్డ వాడిలా, 'క్షమించండి సీతగారూ' అని చేతులు జోడించాడు. అక్కడినుంచి వెళ్ళిపో బోయాడు. 'ఆగు' అని ఆపింది సీత. ఆగిపోయాడు.

'మోహన్రావ్, నీకన్నా నేనే చాల అనుభవజ్ఞురాలివి. పెళ్ళి కాకముందు మొదట నేనూ నీలాగ ఏవేవో వూహించు కున్నాను. కానీ నా మెళ్ళో మూడు ముళ్ళు వేయడమే కాదు, ఆయన నన్ను అమితంగా ప్రేమించారు. ఆయన లేక పోయినా, ఆ ప్రేమను తలుచుకుని, మిగిలిన నా జీవితం గడిపేలా ప్రేమిం చారు. నా మనసులో తానే పదిలంగా నిలిచిపోయేలా ప్రేమించారు. ఆయన్ను ఆ అమృతమయమైన ఆ ప్రేమను నేను ఆజన్మాంతం మరవలేను. మరల పెళ్ళి మాటెత్తి, ఆయనకు ద్రోహం చేసి, ఆ పాపానికి ఒడిగట్టలేను మోహ న్రావ్.' ఇంకెందుకు నాకు వివాహం. వైవాహిక జీవితంలోని మాధుర్యాని చవి చూపించిన ఆయనకు — నా భర్తకే యీ జీవితం అంకితం. ఇప్పుడు ఆయన రూపం, నా గర్భంలో రూపుదిద్దు కుంటుంది. ఆయన బిడ్డకు తల్లినై, ఆ వంశాన్ని నిలబట్టె మహత్తర అవకాశం నా కందించింది. ఆ ఆనందం చూసు కోవటానికి ఆయన లేరు దానికి మన మేమీ చేయలేము అదే విధి। అంతు రార్పణ జరగకపోయుంటె, నేనూ ఎప్పుడో ప్రాణాల్ని విడిచే వుండేదాన్నే కానీ మోహన్రావ్ — మళ్ళీ పెళ్ళి గురించి ఆలోచించేదాన్ని కాను. అంతట జీవితాన్నిచ్చా రాయన నాకు। మళ్ళీ యింకొకసారి ఆ ప్రస్తావన తేకు. వెళ్ళిపో యిక్కణ్నుంచి, వెళ్లిపో.'

రౌద్రంగా మారిన సీతని చూసి, వణికిపోయాడు మోహన్రావ్. తన అపచారాన్ని గ్రహించి, ప్రతిహతం గా వించుకునే మార్గంకోసం కాబోలు ఆరాటపడ్డాడు. ఆఖరికి తనని సంబాళించు కుని అన్నాడు.

'క్షమించండి సీతగారు. నేను పాపిని. మహాపాపిని. ఏదో ఒళ్ళు తెలియని స్థితిలో మీతో అనకూడని మాటలన్నాను. దయచేసి మన్నించండి. దేవతలాంటి మీ ముందుండటానికి నేను అర్హుణ్ని కాను. వెళ్ళిపోతున్నాను. ఈ వూర్లో నుంచే వెళ్ళిపోతున్నాను

'కానీ, ఒక్క మాట. మరొక్క మాట నా పాపానికి పరిహారంగా ఒక్కమాట చెప్పాలని వుంది సీతగారు, చెప్పమంటారా?' అని ఆగాడు.




'ఏమిటది ?' సీత కంఠం ఖంగుమని మోగింది.

'ఎప్పుడైనా, ఏ క్లిష్టపరిస్థితుల్లోగానీ, మీకు ఏమన్నా సాయం కావాలంటె మీ సోదరుడుగా భావించి నన్ను అర్థిస్తారా సీతగారు ? ఆ రోజే గనుక వస్తే నేను ధన్యుణ్ని. మీ పుట్టబోయే బాబుకి నన్ను మేనమామగా చూపిస్తే, నన్ను మీరు క్షమించినట్టు సంతోషిస్తాను. అలా చేస్తారా సీతగారూ ?'

అతని మాటలకు కదలకుండా నిలబడింది సీత. తప్పు చేసినా, మనిషి పశ్చాత్తప్తుడైనప్పుడు క్షమించాలి. అత నిప్పుడు అడిగే దానిలో తప్పులేదు. ఇందులో తనకు వచ్చిన నష్టమూ లేదు.

'ఆ రోజంటూ వస్తే, అలాగే కానీయ్ మోహన్రావ్' అంది దృఢంగా.

'చాల సంతోషం. నేను వెళ్ళొస్తా నమ్మా' అని, వెళ్ళిపోయాడు మోహన్రావ్. అనుకోని రక్త సంబంధ మేదో కలిగినట్టు చూస్తూ నిలుచుంది సీత.